గంటల తరబడి ట్రాఫిక్‌లోనే..

గచ్చిబౌలి: భారీ వర్షానికి ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ జాం అయింది. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి పలు రోడ్లలో కిలోమీటర్ల పొడవున ట్రాఫిక్ స్తంభించిపోయింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బయోడైవర్సిటీ నుంచి ఐకియా కూడలి వరకు, సైబర్‌టవర్ నుంచి కొత్తగూడ జంక్షన్ వరకు, కూకట్‌పల్లి రోడ్డు, మాదాపూర్ నుంచి జూబ్లీహిల్స్ రోడ్లలో భారీగా ట్రాఫిక్ జాం నెలకొంది. కొండాపూర్‌లోని మైహోం మంగళ రోడ్డులో జీహెచ్‌ఎంసీ సహాయక చర్యలు చేపట్టడంతో కిలోమీటరు పొడవునా ట్రాఫిక్ నిలిచిపోయింది. ఐటీ ఉద్యోగులు గంటల తరబడి ట్రాఫిక్‌లోనే ఉన్నారు.

23న 'టెక్ ఫార్వర్డ్' సెమినార్

రాయదుర్గం: ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ ఆధ్వర్యంలో 'టెక్ ఫార్వర్డ్' రీసెర్చ్ సెమినార్ ఆగస్టు ఎడిషన్‌ను ఈనెల 23వ తేదీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 23న సాయంత్రం 4.30 గంటలకు గూగుల్ క్యాంపస్‌లో 'ఫౌండేషనల్ అండ్ లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్' అనే అంశంపై సదస్సు జరుగుతుంది. గూగుల్ రీసెర్చ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ మనీష్ గుప్తా అధ్యక్షతన ఈ కార్యక్రమం జరగనుంది.

'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది.'స్పిరిచ్యువల్ సిగ్నిఫికెన్స్ ఆఫ్ రక్షాబంధన్ పేరిట 'టైయింగ్ ఆఫ్ రాఖీ అండ్ మెడిటేషన్' అంశంపై పూణేకు చెందిన ప్రముఖ పీడియాట్రిక్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ మనోజ్ మత్నాని ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 040–23001234లో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

యువత భవితకు వెలుగుల దివ్వె

పేద, మధ్య తరగతి వర్గాలకు చేయూతనిస్తున్న లైట్ హౌస్

- కంప్యూటర్, సాఫ్ట్ స్కిల్స్ శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలు
- మహిళల స్వయం ఉపాధికి ప్రత్యేక కోర్సులు
- జీహెచ్‌ఎంసీ, దాతల అండగా నిర్వహణ


చందానగర్ హుడా కాలనీలోని లైట్ హౌస్


టైలరింగ్ శిక్షణ తీసుకుంటున్న మహిళలు

చందానగర్: నేడు కంప్యూటర్ పరిజ్ఞానం లేకపోతే ఉద్యోగం రాని పరిస్థితి. దీన్ని దృష్టిలో ఉంచుకొని మహారాష్ట్ర పూణెకు చెందిన గణేష్ నటరాజన్, రుచి మాథుర్‌లు కలిసి 'లైట్ హౌస్' కమ్యూనిటీస్‌ను ప్రారంభించారు. యువతకు అవసరమైన పరిజ్ఞానంతో బాటు మహిళలకు బ్యూటీషియన్, టైలరింగ్, ఎంబ్రాయిడరీతో పాటు 22 కోర్సులలో శిక్షణ ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. దేశ వ్యాప్తంగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు, దాతలతో లైట్ హౌస్‌లు ఏర్పాటు చేసి యువతకు శిక్షణ ఇస్తున్నారు. పేద, మధ్య తరగతి యువతకు కంప్యూటర్ పరిజ్ఞానం, సాఫ్ట్ స్కిల్స్, ఇంటర్వ్యూలకు ఎలా సిద్ధం కావాలి, ఇంగ్లిష్‌లో మాట్లాడడం.. వీటన్నింటిని ఉచితంగా నేర్పిస్తున్నారు చందానగర్ హుడా కాలనీలో 'లైట్ హౌస్' కమ్యూనిటీస్‌లో. ఈ శిక్షణ బయట తీసుకోవాలంటే వేల రూపాయలు ఖర్చు చేయాల్సిందే. ఈ నేపథ్యంలో పలువురికి దారి చూపుతున్నారు ఈ కేంద్రం నిర్వాహకులు. ఇప్పటి వరకు పూణె, ఒడిశా ,ముంబై, ఢిల్లీ, లక్నో, హైదరాబాద్‌లలో 32 లైట్ హౌస్ కేంద్రాలు ఉన్నాయి. శిక్షణ కోర్సులు ఉచితంగా నేర్పించి 80 శాతం యువతకు ఉద్యోగ అవకాశాలు కలిపిస్తున్నారు. ఇక్కడకు ఐటీ ఉద్యోగులు సైతం వచ్చి బోధిస్తున్నారు. కాగా నగరంలో జీహెచ్‌ఎంసీ పరిధిలో కూకట్‌పల్లి, బోరబండ, మల్లేపల్లి, ఎల్బీనగర్‌లలో మరో నాలుగు లైట్ హౌస్‌లు ఏర్పాటు చేయనున్నారు.

- రాష్ట్రంలో మొట్టమొదటి లైట్ హౌస్‌ను 2023 సంవత్సరంలో జీహెచ్‌ఎంసీతో కలిసి చందానగర్ హుడా కాలనీలో ఉన్న మోడల్ మార్కెట్ భవనంలో ఏర్పాటు చేశారు.
- యువతీ, యువకులకు సుమారు 22 రోజులు ఫౌండేషన్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు.
- నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి పేద, మధ్య తరగతి యువత వచ్చి వారికి కావలసిన కోర్సులలో శిక్షణ పొందుతున్నారు.
- యువకులకు కంప్యూటర్‌తో పాటు వారికి కావలసిన ట్యాలీ, జావా వంటి కోర్సులు, ఇంటర్వ్యూలకు స్పోకెన్ ఇంగ్లిష్ కూడా నేర్పిస్తున్నారు.
- బడుగు, బలహీన వర్గాలకు చెందిన ఆడపిల్లలకు కంప్యూటర్ పరిజ్ఞానం, బ్యూటీషియన్ కోర్సు, టైలరింగ్, ఎంబ్రాయిడరీపై శిక్షణ ఇస్తున్నారు.
- ఆయా కోర్సులకు సంబంధించి తరగతి గది, గ్రూప్ డిస్కషన్ కోసం, కంప్యూటర్, టైలరింగ్, బ్యూటీషియన్ గదులు నిర్మించారు.
- లైట్ హౌస్‌లో 12 మంది ట్రైనర్లు శిక్షణ ఇవ్వడానికి అందుబాటులో ఉన్నారు.
- ఫౌండేషన్ కోర్సు 22 రోజులు. 3 నెలల పాటు స్కిల్స్ నేర్పిస్తారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు.
- 2023 సంవత్సరం నుంచి నేటి వరకు 40 బ్యాచ్‌లతో 920 మంది యువత నైపుణ్యం కోసం నమోదు చేసుకోగా ఇప్పటి వరకు 418 మంది ఉద్యోగ అవకాశాలు అందించాం. 291 మందికి వివిధ కోర్సులలో శిక్షణ పూర్తి చేసుకున్నారు.
- లైట్ హౌస్‌లో కోర్సులలో చేరాలంటే 18–35 సంవత్సరాల వయో పరిమితి ఉంది. ఆధార్ కార్డు, విద్యార్హతకు సంబంధించిన సర్టిఫికెట్ ఉండాలి.


కంప్యూటర్ శిక్షణ తీసుకుంటున్న యువత

ఉచిత శిక్షణ



చందానగర్‌లోని లైట్ హౌస్‌లో పేద, మధ్య తరగతి యువతకు కంప్యూటర్ తదితర కోర్సులు ఉచితంగా నేర్పిస్తున్నాం. ప్రభుత్వ సహాయంతో లైట్ హౌస్ కేంద్రాలను విస్తరిస్తున్నాం. 40 బ్యాచ్‌లతో 920 మంది యువత శిక్షణ కోసం నమోదు చేసుకున్నారు.

–శ్రీనివాస్ ఆకుల, లైట్ హౌస్ ప్రోగ్రాం మేనేజర్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చందానగర్: వేమనకాలనీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

- సురక్షా ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.00 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యానగర్, సుభోదయ కాలనీ, రాజేందర్‌రెడ్డి నగర్, అపర్ణహిల్ పార్కు, పద్మజ కాలనీ, ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు.
- పీజేఆర్ ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు పీజేఆర్ రోడ్డు నంబర్ 1,2,3,4,5, లగ్గర్ హైట్స్ అపార్ట్‌మెంట్, జనప్రియ నైల్ వ్యాలీ ఎదురు ఏరియాలలో..
- సీబీఆర్ ఎస్టేట్ ఫీడర్ పరిధిలో.. మ. 3.00 గంటల నుంచి సా. 4.30 గంటల వరకు సీబీఆర్ ఎస్టేట్స్, శ్రీ దుర్గ ఎస్టేట్స్, మెరిడియన్ స్కూల్, వెనుక వైపు, జీహెచ్‌ఎంసీ పార్కు ఎదురుగా ఉన్న ఏరియాలలో..

మాతృశ్రీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో..

- కళ్యాణ్ గార్డెన్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 1.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు మియాపూర్ మెయిన్ రోడ్డు, రాజారాం కాలనీ, మాధవనగర్, అంబేడ్కర్‌నగర్, నందినగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

శేరిలింగంపల్లిలో..

శేరిలింగంపల్లి: 11 కేవీ ఎపిస్టిమో గ్లోబల్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10 గంటల నుంచి 11.30 గంటల వరకు నల్లగండ్ల–తెల్లాపూర్ రోడ్డు, ఎపిస్టిమో స్కూల్ ఏరియా, సాధన స్కూల్ బ్యాక్ సైడ్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు.

- 11 కేవీ డైమండ్ హిల్స్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 1.30 నుంచి 3గంటల వరకు డైమండ్ హిల్స్, సాయిరాం కాలనీ, గోపన్‌పల్లి, జవహర్ నవోదయస్కూల్ ఎదురు ప్రాంతాలలో విద్యుత్ ఉండదని నల్లగండ్ల ఏఈ వెంకటనారాయణరెడ్డి చెప్పారు.

గచ్చిబౌలిలో..

గచ్చిబౌలి: గచ్చిబౌలి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో.. ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు జర్నలిస్ట్ కాలనీ ప్రాంతంలో విద్యుత్ ఉండదని అధికారులు తెలిపారు.

- గౌలిదొడ్డి విద్యుత్ ఫీడర్ పరిధిలో.. 1.30 గంటల నుంచి 3 గంటల వరకు గౌలిదొడ్డి, కేశవనగర్, పద్మశ్రీగార్డెన్ ప్రాంతాలలో..
- 11కేవీ పద్మశ్రీ గార్డెన్స్ విద్యుత్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పద్మశ్రీగార్డెన్స్, గౌలిదొడ్డి ప్రాంతంలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు.

చికిత్సలో నూతన విధానం అవసరం

- రోగి మానసిక ఆరోగ్య పరిస్థితిని నిర్ధారించాలి
- కాంటినెంటల్ ఆస్పత్రి వైద్యులు వీరేందర్, మాలిక్

రాయదుర్గం: రోగి మానసిక ఆరోగ్య పరిస్థితిని నిర్ధారించడంతో బాటు చికిత్సలో నూతన విధానాలు అమలు చేయాలని కాంటినెంటల్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ మాలిక్‌సింగరాజు, డాక్టర్ వీరేందర్ అభిప్రాయపడ్డారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఫెడరేషన్ ఆఫ్ ఏషియన్ బయోటెక్ అసోసియేషన్స్, హెచ్‌సీయూ సైన్స్ గురుస్ సంయుక్త ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన 'డ్రగ్ డిస్కవరీ అండ్ డెవలప్‌మెంట్' అనే అంశంపై నిర్వహించిన వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య రంగంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అప్లికేషన్స్ వినియోగం కూడా అవసరమని, కానీ దాని వల్ల ఏర్పడే లాభనష్టాలను బేరీజు వేసుకోవాలన్నారు. వైద్యాధికారులు సునీల్, డాక్టర్ రత్నాకర్ మాట్లాడుతూ ఔషధ ఆవిష్కరణలో ఏఐ యొక్క క్లిష్టమైన అంచనాపై వారు వివరించారు. ఏఐ డేటా ప్రమాదాలను పరిష్కరించడానికి , డేటా సమగ్రతను నిర్ధారించడానికి మానవ పర్యవేక్షణ అవసరమన్నారు. కార్యక్రమంలో ఐఈఎఫ్‌ఆర్, రెజీన్ ప్రతినిధి డాక్టర్ ఉదయ్ సక్సేనా, ఫెడరేషన్ ఆఫ్ ఆసియా బయోటెక్ అసోసియేషన్స్ సెక్రటరీ జనరల్ డాక్టర్ పి రత్నాకర్, నేషన్ బయో ఫార్మా మిషన్ ప్రతినిధి డాక్టర్ రాజీషిర్కుల్లా, డాక్టర్ బివిఎస్ సునీల్ కుమార్ ప్రసంగించారు. కార్యక్రమంలో వైద్యులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నోబెల్ పీస్ సమ్మిట్‌కు ఆహ్వానం

రాయదుర్గం: మెక్సికోలోని మాంటెర్రేలో జరగనున్న 19వ వరల్డ్ సమ్మిట్ ఆఫ్ నోబెల్ శాంతి గ్రహీతల సమావేశానికి హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీ కన్సల్ట్, డబ్ల్యూటీఐటీసీ చైర్మన్ సందీప్‌కుమార్ మక్తాలకు ఆహ్వానం అందింది. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 18 నుంచి 21వ తేదీ వరకు ఈ సమావేశాలు జరుగుతాయని ఆయన తెలిపారు.

వివేకానందనగర్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్ ప్రారంభం


ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ప్రారంభిస్తున్న రాజేశ్వరరావు, కాలనీవాసులు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి వివేకానందనగర్‌లో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి శుక్రవారం పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేశారు. కాగా ప్రధానరోడ్లలో రోజూ ట్రాఫిక్‌జాంలు ఏర్పడుతున్న నేపథ్యంలో అధికారులు చర్యలు తీసుకున్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ప్రారంభించారు. అదే విధంగా చెత్త సేకరణకు మోటార్ రిక్షా వెహికల్‌ను ప్రారంభించారు.

లింకురోడ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

జోనల్ కమిషనర్‌తో సమావేశమైన ఎమ్మెల్యే గాంధీ


జెడ్సీ ఉపేందర్‌రెడ్డితో సమావేశమైన ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: ప్రజా అవసరాల మేరకు లింకు రోడ్లు అభివృద్ధి చేశారని, పెండింగ్‌లో ఉన్న వాటిపై ప్రత్యేక దృష్టి సారించి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గాంధీ అన్నారు. శుక్రవారం జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డితో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన పనులు, పెండింగ్ పనులపై ఆయన జెడ్సీతో చర్చించారు. పెండింగ్‌లో ఉన్న పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలన్నారు. శేరిలింగంపల్లి అభివృద్ధికి కావాల్సిన నిధులను సీఎంతో మాట్లాడి మంజూరు చేయిస్తామన్నారు. గంగారం హనుమాన్ ఆలయం ప్రధాన రహదారి నుంచి అపర్ణ వరకు లింకురోడ్డు, శ్రీదేవి థియేటర్ నుంచి అమీన్‌పూర్ రోడ్డు విస్తరణ పనులు వెంటనే చేపట్టాలన్నారు. ఇక వర్షాకాలం దృష్ట్యా రోడ్ల మరమ్మతులు ఎప్పటికప్పుడు చేసేలా చూడాలని ఎమ్మెల్యే జెడ్సీకి సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, మియాపూర్ కార్పొరేటర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

నేడు నిరసన ర్యాలీ

ఆల్విన్‌కాలనీ: పశ్చిమ బెంగాల్ కోల్‌కత్తాలో పీజీ వైద్య విద్యార్థినిపై జరిగిన అత్యాచార ఘటనకు నిరసనగా ఐఎంఏ పిలుపు మేరకు శనివారం రాందేవ్‌రావ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ మేరకు హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ కమలాకర్, సీఈఓ యోబు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కేపీహెచ్‌బీ రోడ్డు నంబర్ 1లోని గాంధీ విగ్రహం నుంచి అల్లూరి సీతారామరాజు విగ్రహం వరకు ర్యాలీ కొనసాగుతుందని తెలిపారు.

వరద ప్రవాహం.. సమస్య పరిష్కారం


పూడికతీతను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్, జీహెచ్‌ఎంసీ సిబ్బంది

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఉషా ముళ్లపూడి ప్రధాన రహదారి మహంకాళినగర్, ఛత్రపతి శివాజీ నగర్ వద్ద మ్యాన్‌హోల్ పొంగిపొర్లుతోంది. ఈ విషయాన్ని స్థానికులు కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సంబంధిత అధికారులకు సమాచారం అందించి సమస్యను పరిష్కరించాలన్నారు. జీహెచ్‌ఎంసీ సిబ్బంది ఎయిర్‌టెక్ యంత్రం సహాయంతో డ్రైనేజీలో పూడిక తీసి శుభ్రం చేయడంతో నీటి ప్రవాహం తగ్గింది. కార్యక్రమంలో అంజయ్య యాదవ్, మోజెస్, జీహెచ్‌ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

కేటీఆర్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నాయకుల నిరసన


మైత్రీనగర్ కమాన్ వద్ద నిరసన తెలుపుతున్న మహిళలు

చందానగర్: బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మహిళలను కించపరిచే వ్యాఖ్యలు చేయడం తగదంటూ కాంగ్రెస్ నాయకులు నిరసన తెలిపారు. శుక్రవారం హాఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మైత్రీనగర్ కమాన్ వద్ద పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇంచార్జి జగదీశ్వర్‌గౌడ్ మహిళలతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను అవమానపరుస్తూ బస్సులలో బ్రేక్ డ్యాన్సులు చేయండి అంటూ హేళనగా మాట్లాడడాన్ని ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు కల్పించిన ఉచిత బస్ ప్రయాణంతో వచ్చిన ఆదరణ చూసి ఓర్వలేక తెలంగాణ మహిళా సమాజం ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసే విధంగా మాట్లాడడం సమంజసం కాదన్నారు. ఇది కేటీఆర్ అహంకారానికి నిదర్శనమని, మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, నాయకులు, మహిళలు, యూత్ కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యుఐ నాయకులు పాల్గొన్నారు.

పనుల్లో వేగం పెంచాలి


నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

మాదాపూర్: మాదాపూర్‌లోని ఖానామెట్‌లో నూతనంగా నిర్మించబోయే ప్రభుత్వ డిగ్రీ కళాశాల , తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులను ఆయన అధికారులతో కలసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు వేగవంతం చేయాలని, నాణ్యత పాటించాలని సూచించారు. అవసరమైతే మరిన్ని నిధులు కేటాయించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఈఈ ప్రభాకర్, ఏఈ శ్యామ్‌కుమార్, ఆర్ఐ శ్రీనివాస్, తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ చంద్రారెడ్డి, మాజీ ప్రిన్సిపల్ సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అధునాతన వాటర్ హోల్డింగ్స్ స్ట్రక్చర్లతో వరద నీటికి చెక్


అధికారులతో మాట్లాడుతున్న దానకిషోర్

గచ్చిబౌలి: రోడ్లపై వరద నీరు నిల్వకుండా ఉండేలా అధునాతన వాటర్ హోల్డింగ్స్ స్ట్రక్చర్లను నిర్మించనున్నట్లు రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్ స్పష్టం చేశారు. శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్ పరిధిలో శుక్రవారం ఆయన జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డితో కలిసి పలు ప్రాంతాలను పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు వాటర్ హోల్డింగ్స్ స్ట్రక్చర్ల నిర్మాణానికి సంకల్పించినట్లు పేర్కొన్నారు. రహదారులపై నీరు నిలిచి వాహనాల రాకపోకలకు ఏర్పడుతున్న అంతరాయాన్ని వీటితో శాశ్వతంగా పరిష్కరించేందుకు అవకాశం కలుగుతుందన్నారు. కీలకమైన ప్రధాన రహదారులపై వరదనీరు ఇంకుడు గుంతల్లోకి తక్షణమే చేరుతుందన్నారు. తద్వారా ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగదన్నారు. ప్రత్యేక మోటార్లతో వీటిల్లోని వరదనీటిని సమీపంలోని నాలాలు, డ్రైన్లలోకి నింపే ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన వివరించారు. ప్రయోగాత్మకంగా తొలుత శేరిలింగంపల్లి జోన్ పరిధిలో చేపడుతున్న ఈ తరహా నిర్మాణాలను దశలవారీగా ఇతర ప్రాంతాలకూ విస్తరిస్తామన్నారు. శేరిలింగంపల్లిజోన్ పరిధిలోని రోడ్‌నెంబర్ 45, నెక్టార్ గార్డెన్స్, సైబర్ టవర్స్ ప్రాంతాలలో ఎస్ఎన్‌డీపీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న వాటర్ హోల్డింగ్ స్ట్రక్చర్లను పరిశీలించినట్లు దానకిషోర్ తెలిపారు. ఆయన వెంట జీహెచ్‌ఎంసీ ఎస్ఎన్‌డీపీ సీఈ కిషన్, ఎస్ఈ శంకర్, డీఈ రమేష్ ఉన్నారు.

చందానగర్‌లో 'ఆర్టీసీ లాజిస్టిక్స్' ప్రారంభం


చందానగర్: టీజీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ నూతన కౌంటర్‌ను చందానగర్ బస్టాప్‌లో శుక్రవారం డిప్యూటీ సీటీఎం మధుసూదన్, ఏటీఎం (లాజిస్టిక్స్) వెంకట నారాయణ ఆధ్వర్యంలో ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చందానగర్ పరిసర ప్రాంత ప్రజలు ఈ కౌంటర్‌లోని కొరియర్, కార్గో, పార్సిల్ సరీ్వసులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏజెంట్ రమేష్ ,మార్కెటింగ్ సిబ్బంది శ్రావణ్, జంబన్న, విజేందర్‌రెడ్డి, రమేష్ ఉన్నారు. టీజీఎస్ఆర్టీసీ లాజిస్టిక్ ఏజెంట్స్‌గా ఆసక్తి ఉంటే 9652267204, 8919525373లను సంప్రదించాలని సూచించారు.


● కూరగాయల ధరలు..

నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 30, పచ్చిమిర్చి 60, బెండ 40, కాకర 50, దొండ 40, దోస 30, ఆలు 40, చామ 50, కీర 30, బీర 40, వంకాయ 40, గోకర 45, బీన్స్ 60, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 30, క్యారెట్ 50, చిక్కుడు 60, ఉల్లి 40(కేజీ), ములక్కాయలు (3)20 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 180.

వైభవంగా వరలక్ష్మీ వ్రతం


శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతంను ఘనంగా నిర్వహించుకున్నారు. రాయదుర్గం, మధురానగర్, ఖాజాగూడ, గచ్చిబౌలి, జీపీఆర్ఏ క్వార్టర్స్, మసీదుబండ, గోపన్‌పల్లి, కొండాపూర్, కొత్తగూడ తదితర ప్రాంతాలలోని ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకారం చేశారు. అలాగే మహిళలు వ్రతాలు నోచుకున్నారు. – రాయదుర్గం


వరలక్ష్మీదేవికి ప్రత్యేక అలంకారం


శివసాయిక్షేత్రంలో అన్నపూర్ణాదేవి


గచ్చిబౌలిలో వరలక్ష్మీ వ్రతం చేసుకుంటున్న మహిళలు

గుర్తుతెలియని వ్యక్తి మృతి




మియాపూర్: గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. మియాపూర్ సీఐ దుర్గారామలింగ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం...మియాపూర్ మదీనాగూడలోని మ్యాక్స్ షాపింగ్‌మాల్ ముందు ఉన్న బస్‌షెల్టర్‌లో ఓ వ్యక్తి (40–45) అపస్మారక స్థితిలో పడి ఉన్నాడని స్థానికులు శుక్రవారం ఉదయం మియాపూర్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా ఓ వ్యక్తి అప్పటికే మృతి చెంది ఉన్నాడు. చుట్టు పక్కల ఆరా తీయగా సమాచారం తెలియరాలేదు. దీంతో మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. వ్యక్తి సమాచారం తెలిస్తే మియాపూర్ పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.

వసతుల కల్పనకు సహకరించాలి


డీసీ రజనీకాంత్‌రెడ్డితో సమావేశమైన కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌లోని కాలనీలు, బస్తీలలో మౌలిక వసతుల కల్పనకు సహకరించాలని శేరిలింగంపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డిని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి కోరారు. జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం ఆయన డీసీని కలిశారు. అనంతరం గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ రాయదుర్గం, నల్లగండ్ల, హుడాకాలనీ, డిఫెన్స్‌కాలనీలో డ్రైనేజీ , తాగునీటి సమస్యలు పరిష్కరించాలని, రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. అనంతరం సర్కిల్ ఈఈ దుర్గాప్రసాద్‌తో మాట్లాడారు. అభివృద్ధి పనులు, పెండింగ్ పనులు పూర్తయ్యేలా చూడాలని, కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు శేఖర్, మన్నే రమేష్, రాజు, నర్సింహ, మణి పాల్గొన్నారు.

కార్పొరేటర్ పర్యటన


డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు తదితరులు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని రాంనరేష్ నగర్‌లో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులను చేపట్టనున్నట్లు కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు తెలిపారు. జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి శుక్రవారం కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదర్‌నగర్ డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్లు మహదేవ్, దేవి, డ్రైనేజీ సూపర్‌వైజర్ ఓం ప్రకాష్, కాలనీవాసులు నక్క శ్రీనివాస్, సత్యనారాయణ, కృష్ణారెడ్డి, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

లింగంపల్లి అండర్ బ్రిడ్జి కింద వరద నీరు



శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిలో శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయం అయ్యాయి. లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి కింద వరద నీరు చేరడంతో వాహనాల రాకపోకలు నిలిచాయి. వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. రైల్వే అండర్ బ్రిడ్జి ద్వారా వెళ్లే వరద నీటి కాలువ పనులు జరుగుతుండడంతో నీరు అక్కడే నిలిచిపోతోంది.దీంతో జీహెచ్‌ఎంసీ సిబ్బంది వరదనీటి మళ్లింపు పనులు చేపట్టారు.

నేడు శని త్రయోదశి పూజలు

పటాన్‌చెరు టౌన్: శని త్రయోదశి సందర్భంగా పటాన్‌చెరు పాత టోల్‌గేట్ సమీపంలోని శ్రీ రామలింగేశ్వర దేవస్థానం, జేపీ కాలనీలోని పంచముఖి హనుమాన్ దేవస్థానంలో శనివారం ఉదయం 5:30 గంటల నుండి శనీశ్వర స్వామికి తైలాభిషేకం, పూజలు జరుగుతాయని ఆలయ అర్చకులు మహేష్ ,నరేష్ తెలిపారు.